

రైతు వ్యతిరేక ప్రభుత్వమిది

సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో రాష్ట్రంలో రైతు వ్యతిరేక పాలన సాగిస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి ధ్వజమెత్తారు. -8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురు॥ (సా॥)	సహర్ శుక్ర॥ (ఉ॥)
కడప	: 6.31	5.05
పులివెందుల	: 6.33	5.10
ప్రొద్దుటూరు	: 6.32	5.09

గరిష్టం/కనిష్టం
39.4/23.6

వాతావరణం

జిల్లాలో బుధవారం 23.6 - 39.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

అంగన్వాడీ కేంద్రాలకు ఒంటిపూట బడి

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో ఒంటిపూట బడి నిర్వహించాలని ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ సునీత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18 నుంచి మొదలైన ఒంటిపూట బడి సమయ వేళలు ఏప్రిల్ 31వ తేది వరకు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అంగన్వాడీ కేంద్రాలను నడపాలని సూచించారు.

23న దేవుని కడప పోలీసు డిపార్ట్‌మెంట్ ఉద్యోగుల సభ

కడప అర్బన్: దేవుని కడప పోలీసు డిపార్ట్‌మెంట్ ఉద్యోగుల పరస్పర సహకార గృహ నిర్మాణ సంఘం సంవత్సరపు మహాజన సభ ఈనెల 23 వతేదీన ఉదయం 10 గంటలకు కడపలోని వైఎస్‌ఆర్ పోలీసు కాలనీలో నిర్వహించనున్నట్లు దేవుని కడప పోలీస్ హౌసింగ్ సొసైటీ ప్రెసిడెంట్ కె. ప్రభాకర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘంలో ఇళ్ల స్థలాలు పొందిన సభ్యులు గృహ నిర్మాణం చేసుకునే విషయాలతోపాటు, ఇతర అంశాలపై చర్చ జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

కేజీబీవీల్లో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని 17 కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో 6,11 తరగతులలో ప్రవేశాలకు 2025–26 విద్యా సంవత్సరానికి ఆన్‌లైన్ ద్వారా మార్చి 22 నుంచి మే 11వ తేదీ వరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ నిత్యానందరాజులు తెలిపారు. అలాగే కేజీబీవీల్లో 7,8,9 తరగతులలో మిగిలిన సీట్ల కోసం కూడా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. దరఖాస్తులను https://apkgbv.apcfss.in వెబ్‌సైట్ ద్వారా చేసుకోవాలని తెలిపారు.


మైనార్టీ బాలుర పాఠశాలలో ప్రవేశాలకు...

కడప ఎడ్యుకేషన్: కడపలోని ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల (మైనార్టీ బాలుర)లో 2025–26 విద్యా సంవత్సరానికిగాను ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ పేతకంశెట్టి సోమ సత్యశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో 80 సీట్లు, 6,7,8 తరగతుల్లో మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మైనార్టీ బాలురతోపాటు ఎస్సీ, ఎస్టీ బాలురు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 31లోగా https://aprs.apcffss.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఏప్రిల్ 25వ తేదీ ప్రవేశ పరీక్ష ఉంటుందని వివరించారు. వివరాలకు 7780179446, 90595 00173 నెంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఉప సర్పంచుల ఎన్నికకు నోటిఫికేషన్

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో వివిధ కారణాల వల్ల ఖాళీగా ఉన్న తొమ్మిది ఉప సర్పంచుల స్థానాలను భర్తీ చేసేందుకు ఈనెల 27వ తేదీ ఉదయం 10 గంటలకు ఎన్నిక నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మేరకు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించేందుకు జిల్లా పంచాయతీ అధికారి జి.రాజ్యలక్ష్మి బుధవారం ప్రొసీడింగ్స్ జారీ చేశారు. ప్రొద్దుటూరు మండలం గోపవరం, సింహాద్రిపురం మండలం అంకాలమ్మగూడూరు, సీకే దిన్నె మండలం బుసిరెడ్డిపల్లె, కమలాపురం మండలం కోగటం, బ్రహ్మంగారిమఠం మండలం గొడ్లవీడు, ఎర్రగుంట్ల మండలం తుమ్మలపల్లె, చిర్రాజుపల్లె, దువ్వూరు మండలం ఇడమడక, చెన్నూరు మండలం ముండ్లపల్లె పంచాయతీలకు సంబంధించిన ఉప సర్పంచ్ ఎన్నికలు జరగనున్నా యి. ఇందుకోసం అధికారులను నియమించా రు. ఏదైనా కారణాల రీత్యా ఆరోజు ఎన్నిక జరగకపోతే మరుసటిరోజు నిర్వహించాల్సి ఉంటుంది.

జూడాల సంఘం నూతన కమిటీ ఏర్పాటు



ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ సురేఖను కలిసిన జూడాల సంఘ సభ్యులు


కడప అర్బన్: ప్రభుత్వ వైద్య కళాశాల జూనియర్ డాక్టర్ల సంఘం (జీఎంఎస్‌కె– జూడా) కొత్త కమిటీ ఏర్పాటైంది. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. సురేఖ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై. విజయభాస్కర్ రెడ్డి కొత్త కమిటీని అభినందించారు. అధ్యక్షుడిగా ఎన్నికై న డాక్టర్ ఎస్. విష్ణు వర్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు డాక్టర్ బి. విజయ్, డాక్టర్ చరిత, డాక్టర్ పూజ, డాక్టర్ ప్రతిభ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ. నిఖిల్ సింగ్, డాక్టర్ సుబ్బారెడ్డి కళాశాలలోని సమస్యల గురించి ప్రిన్సిపల్‌కు వినతిపత్రం అందజేశారు. కళాశాల సమస్యల గురించి ప్రస్తావించారు. సానుకూలంగా స్పందించిన ప్రిన్సిపల్ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

కూటమికి రిజర్వ్ ఫారెస్టా!

- తెలుగుతమ్ముళ్ల అక్రమాలపై కన్నెత్తి చూడని జిల్లా యంత్రాంగం
- రిజర్వు ఫారెస్టు పేరుతో కాశినాయనలో కట్టడాలు కూల్చివేత
- అదే రిజర్వు ఫారెస్టు పరిధిలోని సీకేదిన్నెలో యథేచ్ఛగా గ్రావెల్, కట్టుడు రాయి అక్రమ రవాణా
- ఎర్రచందనం మొక్కలు పెకలిస్తున్నా పట్టించుకోని వైనం
- నేతల దోపిడీకి అధికారుల సహకారం



సీకేదిన్నె రిజర్వు ఫారెస్టు పరిధిలోని చెట్ల పొదల్లో జేసీబీతో పనులు



సాక్షి ప్రతినిధి, కడప: 'రిజర్వు ఫారెస్టులో కట్టడాలు ఎలా కొనసాగిస్తాం. అనుమతుల్లేని నిర్మాణాలు మాత్రమే కూల్చాం...' నిన్నా, మొన్నా కాశినాయన క్షేత్రంపై అధికారులు చెప్పుకొచ్చిన మాటలివి. అదే రిజర్వు ఫారెస్టు పరిధిలోని గ్రావెల్‌ను అక్రమ రవాణా చేస్తున్నా.. కట్టుడు రాయి తరలిస్తున్నా.. చివరికి జాతీయ సంపదగా నిలుస్తున్న ఎర్రచందనం మొక్క లు అక్రమార్కుల దుశ్చర్యలు కారణంగా నేలరాలుతున్నా అధికారులకు కనిపించడం లేదు. ఎందుకంటే ఇక్కడి అక్రమార్కులు పచ్చ నేతలు కావడమే కారణం.

అక్రమార్కులకు నిలయం: చింతకొమ్మదిన్నె మండలం కొలుములపల్లె రిజర్వు ఫారెస్టు అక్రమార్కులకు నిలయంగా మారింది. రెండు పెద్ద జేసీబీలతో నిత్యం అక్రమంగా గ్రావెల్ తరలుతోంది. పదుల సంఖ్యలో టిప్పర్లు గ్రావెల్ తరలిస్తున్నాయి. లెక్కకు మించి ట్రాక్టర్లు కట్టుడు రాయిని తరలిస్తున్నాయి. భారీ ప్రొక్లెయిన్లు గ్రావెల్ తవ్వకాల కారణంగా ఎర్రచందనం మొక్కలు నలిగి పోతున్నాయి. వందల సంఖ్యలో మొక్కలు నేలరాలుతున్నాయి. ఇవేవీ అటు ఫారెస్టు అధికారులకు, ఇటు మైనింగ్ అధికారులకు కన్పించవు. అదే కాశినాయన క్షేత్రంలో అక్రమ కట్టడాలు తొలగించాల్సిందిగా జనవరిలోనే జిల్లాలోని ఆయా విభాగాలకు చెందిన అధికారులు ఉత్తర్వులు సైతం జారీ చేశారు. అదే కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి కొలుములపల్లె రిజర్వు ఫారెస్టు నుంచి గ్రావెల్ తరలించడం ద్వారా కోట్లాది రూపాయలు అక్రమ సంపాదన ఆర్జిస్తున్నా, కట్టడి చేయాలనే ఆలోచన కూడా జిల్లా సర్వోన్నతాధికారికి తట్టడం లేదనే ఆరోపణలున్నాయి.



రిజర్వు ఫారెస్టులో గ్రావెల్ తరలించడంతో ఏర్పడిన భారీ గోతులు

కాశినాయన క్షేత్రంపై కుట్రతోనే...

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక కాశినాయన క్షేత్రంపై కన్ను పడింది. టైగర్ జోన్ పేరిట గత ఏడాది డిసెంబరులో, ఈ ఏడాది జనవరిలో, మూడో దఫా ఈనెల 7న జ్యోతి క్షేత్రంలోని కుమ్మరి అన్నదాన సత్రం, విశ్వబ్రాహ్మణ అన్నదాన సత్రం, గోవుల దాణా షెడ్డు, గోశాల షెడ్డు, మరుగుదొడ్లను కూలిచ్చేశారు. అలాగే లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి కొద్దిదూరంలో ఉన్న శివరంగారెడ్డి నిర్మించిన గెస్ట్ హౌస్‌ను కూలగొట్టారు. టైగర్ జోన్ పేరిట ఈ దుశ్చర్యకు పాల్పడడం వెనుక నల్లమల అటవీ ప్రాంతంపై అక్రమార్కుల ప్రత్యేక దృష్టి కారణంగానే చేపట్టారని కాశినాయన భక్తులు ఆరోపిస్తున్నారు. జనసంచారం లేకుండా ఉంటే అనుకున్న ప్రణాళిక నల్లమల అడవుల్లో అమలు పర్చేందుకు అవకాశం ఉంటుందనే కాశినాయన క్షేత్రంపై దృష్టి సారించారని పలువురు ఆరోపణలు చేస్తున్నారు. 'తమ్ముళ్ల' దోపిడీకి జిల్లా యంత్రాంగం చర్యలు అందుకు ఊతమిస్తున్నాయి. ఇప్పటికైనా ద్వంద్వనీతి వీడి రిజర్వు ఫారెస్టులో అక్రమంగా గ్రావెల్, కట్టుడు రాయి తరలిస్తున్న వారిని కట్టడి చేస్తూనే, ఎర్రచందనం మొక్కలను సంరక్షించాల్సిన ఆవశ్యకత ఉంది. మరి కలెక్టర్ ఏమేరకు స్పందిస్తారో చూడాలి.

కక్షగట్టి.. కూల్చివేసి..



కాశినాయన జ్యోతి క్షేత్రం

అదొక క్షేత్రం.. అక్కడేమీ మంత్రాలు, తంత్రాలు, తాయెత్తులు, యంత్రాలు కానరావు. మాయా మర్మం మాటలు, వ్యాపార లావాదేవీలు అంతకన్నా ఉండవు. కనీస ఫిర్యాదులూ వినిపించవు. కష్టాలు కనిపించవు. అక్కడ ఉన్నదల్లా నిత్య అన్నదానం, స్వచ్ఛంద విరాళాల తత్వం. లాభాపేక్షలేని సేవా భావం. అనాథలు, నిరాశ్రయులు, ఒంటరి వారికి అదొక ఆలయం. దీనులకు దేవాలయం. పచ్చటి నేలలోని ప్రశాంత క్షేత్రం. కళకళాడుతున్న కాశినాయన క్షేత్రంపై కూటమి ప్రభుత్వం కన్నుపడింది. అంతే అనుకున్నదే తడవుగా రిజర్వు ఫారెస్టులో కట్టడాలు తిష్టవేశాయంటూ కూల్చివేత మొదలైంది. ఇక్కడే అధికార యంత్రాంగం ద్వంద్వనీతి బహిర్గతమవుతోంది. చింతకొమ్మదిన్నె మండలం కొలుములపల్లెలో సర్వే నంబర్ 838లో 986.96 ఎకరాలు రిజర్వు ఫారెస్టు పరిధిలో ఉందని రెవెన్యూ రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. రిజర్వు ఫారెస్టులో ఎలాంటి అక్రమ చొరబాట్లు ఉండరాదని ఫారెస్టు అధికారులు వెల్లడిస్తున్నారు. ఆచరణలో అమలు కావడం లేదు. దర్జాగా గ్రావెల్ ట్రావెల్ చేస్తోంది. నిత్యం కట్టుడు రాయి తరలిపోతుంది. మరి ఈ అక్రమాలు అధికారులకు కనిపించవా.. కూటమి ప్రభుత్వానికి పట్టదా.. అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ల్యాండ్ మాఫియాను అరికట్టాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కూటమి ప్రభుత్వంలో రెచ్చిపోయి అక్రమాలకు పాల్పడుతున్న ల్యాండ్, శాండ్ మాఫియాను అరికట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాలను సమూలంగా మార్పులు చేస్తామని చెప్పినప్పటికీ ఆచరణలో భిన్నంగా నడుస్తోందన్నారు. విలువైన ప్రభుత్వ వంకా, వాగు, చెరువు, రాస్తా, అసైన్డ్, దేవాదాయ, ఈ నామ్, వక్ఫ్, అటవీ, స్మశాన భూముల ఆక్రమణ యదేచ్ఛగా సాగుతుందన్నారు. ఎక్కడపడితే అక్కడ అనుమతులు లేని మట్టి క్వారీలు ఏర్పా టు చేసుకొని యథేచ్ఛగా తవ్వకాలు చేపట్టి అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారని విమర్శించారు. మండిపోతున్న ఎండల ప్రభావం భూగర్భ జలాలు పడిపోయి బోర్లు ఎండిపోయి చేను ఎండిపోయి రైతులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు.

పీపీ యూనిట్ వైద్యురాలిపై సస్పెన్షన్ వేటు

ప్రొద్దుటూరు క్రైం: ప్రొద్దుటూరులోని పీపీ యూనిట్ వైద్యురాలు ఇలియారాణిపై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. నక్కలదిన్నె గ్రామానికి చెందిన శివలక్ష్మికి కొన్ని రోజుల క్రితం చేసిన కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లో నిర్లక్ష్యం వహించారనే కారణంతో ఇలియారాణిని సస్పెండ్ చేశారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ హెల్త్ పద్మావతి నుంచి డీఎంహెచ్‌ఓ నాగరాజుకు మంగళవారం రాత్రి ఉత్తర్వులు అందాయి. తన భార్యకు అన్యాయం జరిగినా ఉన్నతాధికారులు పట్టించుకోలేదని రెండు రోజుల క్రితం విశ్వనాథ్ రెడ్డి కలెక్టరేట్‌లో ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసిన విషయం తెలిసిందే. పీపీ యూనిట్ ఇన్‌చార్జి బాధ్యతలను డాక్టర్ నజీర్‌బాషాకు అప్పగించారు.

దూరవిద్య కోర్సుల ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

డైరెక్టర్ ఆచార్య కృష్ణారెడ్డి వెల్లడి

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన యూనివర్సిటీ సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్లైన్ ఎడ్యుకేషన్ (సీడీవోఈ) ద్వారా పలు కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 30 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని డైరెక్టర్ ప్రొఫెసర్ కె. కృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన ప్రిన్సిపల్ ఎస్ రఘునాథరెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ తో కలిసి మాట్లాడారు. యోగి వేమన విశ్వవిద్యాలయం గుర్తింపునిచ్చిన అధ్యయన కేంద్రాల్లో ఎంఏ ఎకనామిక్స్, ఇంగ్లిష్, హిస్టరీ, జర్నలిజం, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, తెలుగు, ఎం కామ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. బ్యాచిలర్ డిగ్రీలో ఎకనామిక్స్ చదివిన వారికి మాత్రమే ఎంఏ ఎకనామిక్స్ లో ప్రవేశాలు ఉంటాయని అలానే బీకాం, బీబీఏ, బీబీఎం డిగ్రీ చేసిన వారు ఎంకామ్‌లో ప్రవేశాలకు అర్హులన్నారు. మిగిలిన అన్ని కోర్సులకు ఏదేని డిగ్రీ పాసైతే చాలన్నారు. ఈ ఏడాది నూతనంగా బ్యాచిలర్ ఆఫ్ ఫైనార్ట్స్ (బీఎఫ్ఏ ఆనర్స్) మ్యూజిక్ నాలుగేళ్ల డిగ్రీ కోర్సును ప్రారంభించామన్నారు. ఈ కోర్సులో ప్రవేశానికి ఇంటర్మీడియట్, సమాన అర్హత గల వారు ప్రవేశానికి అర్హులన్నారు. ఈ కోర్సులన్నీ డిస్టెన్స్, ఆన్లైన్ లర్నింగ్ విధానంలో ఉంటాయన్నారు. వివరాలకు https://cde.yvu.edu.inను సంప్రదించాలని సూచించారు.



వైవీయూ ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డితో మాట్లాడుతున్న దూర విద్య డైరెక్టర్ ఆచార్య కృష్ణారెడ్డి

రెండో రోజు ఒకరు డిబార్

కడప ఎడ్యుకేషన్: పదవ తరగతి పరీక్షల్లో భాగంగా బుధవారం నిర్వహించిన హిందీ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. రెగ్యులర్‌కు సంబంధించి 27671 మంది విద్యార్థులకుగాను 17531 మంది హాజరుకాగా 140 మంది గైర్హాజరయ్యారు. అలాగే ప్రైవేటు విద్యార్థులకు సంబంధించి 10 మందికిగాను ఇద్దరు గైర్హాజయ్యారు. కడపలోని ప్రభుత్వ బాలికల పాఠశాల పరీక్షా కేంద్రంలో ఓ విద్యార్థి చూసి రాస్తుండగా స్క్వాడ్ బృందం డిబార్ చేసినట్లు ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమీషనర్ వెంకటేషు తెలిపారు.



పరీక్షలకు హాజరైన విద్యార్థులు

జెడ్పీ చైర్మన్ ఎన్నికలపై మంతనాలు



సమావేశంలో చర్చిస్తున్న వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు

కడప కార్పొరేషన్: ఈనెల 27న జరగనున్న జెడ్పీ చైర్మన్ ఎన్నికలపై వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు చర్చించారు. గురువారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి అధ్యక్షతన వారు సమావేశమయ్యారు. అన్నమయ్య జిల్లా పార్టీ అధ్యక్షుడు ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రఘురామిరెడ్డి, రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

21న నేషనల్ యూత్ పార్లమెంట్ ఫెస్టివల్ -2025

కడప ఎడ్యుకేషన్: పార్లమెంట్ లో ప్రసంగించే అవకాశం కోసం ఉపన్యాస పోటీలు ఈ నెల 21న కడపలోని కేఎస్‌ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించనున్నట్లు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి కె.మణికంఠ ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ ఉమ్మడి జిల్లాలోని 18 –25 ఏళ్లలోపు గల యువత ఈ పోటీలలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. వివరాలకు 9177616677 నెంబర్ సంప్రదించాలని సూచించారు.

రామయ్య క్షేత్రానికి రైళ్లేవి?

ఒంటిమిట్ట శ్రీ కోదండరాముని క్షేత్రంలో ఉన్న రైల్వేస్టేషన్ దుస్థితిలో కొట్టుమిట్టాడుతోంది. ఓ వైపు టీటీడీ వార్షిక బ్రహ్మోత్సవాలను కోట్లాది రూపాయిలు వెచ్చించి వైభవంగా నిర్వహిస్తుంటే.. దూర ప్రాంతాలకు చెందిన వారు ఈ వైభవం, ఆలయం ప్రాశస్త్యంను తెలుసుకునేందుకు రావాలంటే రైలు సౌకర్యం లేదు. టీటీడీ చొరవతో అయినా ఒంటిమిట్ట రైల్వేస్టేషన్ బాగుపడుతుందా అని భక్తులు ఎదురుచూస్తున్నారు.

- ఒంటిమిట్ట కోదండ రామాలయానికి రైలుమార్గంలో వచ్చేదెలా..?
- భద్రాచలం తరహాలో స్టేషన్ అభివృద్ధి ఏదీ?
- మొన్నటి వరకు ఒంటిమిట్ట, భద్రాచలం రెండు ఎస్సీ రైల్వేలోనే ..
- విశాఖ జోన్‌కే తలమానికం ఒంటిమిట్ట రామాలయం
- ఒంటిమిట్టపై రైల్వేశాఖ వివక్ష
- భక్తులకు రైలు సౌకర్యంపై దృష్టిపెట్టని టీటీడీ



ఒంటిమిట్ట రైల్వేస్టేషన్

రాజంపేట: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు భద్రాచలం అధికారిక రామాలయంగా భాసిల్లింది. నవ్యాంధ్ర ఏర్పడిన తర్వాత ఆంధ్రా భద్రాచలంగా ఒంటిమిట్ట కోదండరామాలయం అధికారిక రామాలయంగా ప్రభుత్వం అధికారిక కార్యక్రమాలను చేపడుతూ వస్తోంది. రెండవ అయోధ్యగా..ఏకశిలానగరంగా పిలవబడుతున్న ఒంటిమిట్ట రైల్వేస్టేషన్‌కు భక్తులు చేరుకునేందుకు రైలే లేదు. ఉన్న ఏ రైలూ ఆగదు. ఏటా ఒంటిమిట్ట కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలను తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తూ వస్తున్నారు. ఈయేడాది ఏప్రిల్ 5 నుంచి ఉత్సవాలను వైభవంగా ప్రారంభించేందుకు టీటీడీ సన్నాహాలు చేస్తోంది. కానీ సౌత్ సెంట్రల్ రైల్వే తమ వంతు బాధ్యతగా ఒంటిమిట్టకు భక్తులు చేరుకునేందుకు కల్పించిన రైలు సౌకర్యం శీతకన్ను పెట్టిందనే విమర్శలున్నాయి. ఒంటిమిట్ట రామయ్య చెంతకు చేరుకునేందుకు భక్తులకు వీలులేని పరిస్థితులు దాపురించాయి.

భద్రాచలం తరహాలో స్టేషన్ అభివృద్ధి ఏదీ?

తెలంగాణ రాష్ట్రంలో ఉన్న భద్రాచలం రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేసిన తరహాలోనే ఒంటిమిట్ట రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయాల్సి ఉంది. అయితే దక్షిణ మధ్య రైల్వే శీతకన్ను చూపుతోందనే అపవాదును మూటకట్టుకుంది. ముంబాయి–చెన్నై కారిడార్ రైలుమార్గంలో నడిచే ప్రతి రైలుకు ఒంటిమిట్టలో స్టాపింగ్ ఇవ్వాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని భక్తులు, ఆధ్యాత్మిక వేత్తలు అంటున్నారు. ప్రస్తుతానికి డెమో ఒక్క రైలు మాత్రం ఉదయం, సాయంత్రం ఆగుతుంది.

దూరప్రాంత భక్తులెలా వచ్చేది..

దూర ప్రాంత భక్తులు రైలుమార్గంలో రామయ్య చెంతకు వచ్చేందుకు వీలు లేకుండా పోయింది. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి భక్తులు ఒంటిమిట్ట రామయ్య దర్శనానికి వస్తున్నారు. భద్రాచలం రోడ్ రైల్వేస్టేషన్ మీదుగా భక్తులు వచ్చేందుకు వీలుగా రైళ్లు నడుస్తున్నాయి. ఒంటిమిట్ట స్టేషన్ పేరుకు మాత్రమే ఉంది. నవమి బ్రహ్మోత్సవాలు, స్వామివారి కళ్యాణం రోజున లక్షలాది మంది భక్తులు ఒంటిమిట్టకు చేరుకుంటారు. ఒంటిమిట్ట స్టేషన్ అభివృద్ధి చేయాలంటూ ప్రజాప్రతినిధులు గళం విప్పుతున్నారు. అయినా రైల్వేశాఖలో ఎటువంటి స్పందన కనిపించలేదన్న విమర్శలున్నాయి.

కోవిడ్ ముందు నడుస్తున్న ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఒంటిమిట్టను ఆంధ్రా భద్రాదిగా గుర్తించి, అభివృద్ధి చేస్తుంటే రైల్వేశాఖ తన వంతు పాత్రను పోషించడం లేదు. పల్లె స్టేషన్‌లాగే రైల్వేశాఖ భావిస్తోంది. ఒక సుప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా ఒంటిమిట్టను పరిగణనలోకి తీసుకోలేదు. ఒంటిమిట్ట, భద్రాచలం రెండు పుణ్యక్షేత్రాలు దక్షిణ మధ్య రైల్వేలోనే ఉండేది. భద్రాచలం స్టేషన్‌కు ఇస్తున్న ప్రాధాన్యతను ఒంటిమిట్టకు ఇవ్వడం లేదంటే వివక్షను ప్రదర్శించినట్లేనని భక్తులు భావిస్తున్నారు.

రైలు సౌకర్యంపై దృష్టి పెట్టని టీటీడీ ..

ఒంటిమిట్ట రామాలయం టీటీడీలో విలీనమైంది. అయితే ఎంతసేపు రామాలయం అభివృద్ధి వరకు దృష్టి కేంద్రీకరించింది. అయితే రామయ్య క్షేత్రానికి భక్తులు వచ్చేందుకు అవసరమైన సౌకర్యాలపై దృష్టి సారించలేదన్న విమర్శలున్నాయి. ఒంటిమిట్టకు భక్తులు వచ్చేలా రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలని టీటీడీ రైల్వేబోర్డును కోరితే తప్పకుండా స్పందిస్తుందని రైల్వే వర్గాలు చెపుతున్నాయి. ఈవో భక్తులకు రైలు సౌకర్యం కల్పించే విషయంసౌ దృష్టిపెట్టాలని రాష్ట్రంలోని పలు ప్రాంతాల భక్తులు కోరుతున్నారు.

కొత్తజోన్‌లో అయినా..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న ఎస్సీ రైల్వేలో ఏపీకి ప్రత్యేకంగా జోన్ ఏర్పాటైంది. విశాఖ జోన్‌కే తలమానికం ఒంటిమిట్ట రామాలయం. అధికారికంగా గుర్తించిన రామాలయం ఇదే. అటువంటప్పుడు కొత్త జోన్ వల్ల రామాలయం ఉన్న ఒంటిమిట్ట స్టేషన్‌కు గుర్తింపు వస్తుందన్న ఆశలున్నాయి.

భక్తుల రాకకు రైలు మార్గమే అనుకూలం



దూరప్రాంతాల నుంచి భక్తులు ఒంటిమిట్టకు చేరుకునేలా రైలు సౌకర్యం కల్పించాలి. భక్తులకు ఏ విధంగా భద్రాచలం రైల్వేస్టేషన్ సౌకర్యంగా ఉందో, అలాగే ఒంటిమిట్టను మార్చాలి. ఏపీకి అధికారిక రామాలయంగా గుర్తించారు. అదే రీతిలో రైల్వేపరంగా భక్తులకు సౌకర్యాల ఏర్పాటుకు కృషిచేయాలి. కనీసం కళ్యాణం రోజైనా స్టాపింగ్ కల్పించాలి. ఎంపీలు పీవీ మిథున్‌రెడ్డి, మేడా రఘునాథ్‌రెడ్డిల దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళతాం.

-తంబ్లెళ్ల వేణుగోపాల్‌రెడ్డి, డీఆర్‌యుసీసీ సభ్యుడు

రైల్వే మంత్రిత్వశాఖ దృష్టికి తీసుకెళతాం



టీటీడీ ఒంటిమిట్ట కోదండ రామాలయంకు ప్రత్యేక గుర్తింపు ఇస్తోంది. మరి ఎందుకు రైల్వేశాఖ వివక్ష చూపుతోంది. రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి ద్వారా ఒంటిమిట్ట రైల్వేస్టేషన్‌లో రైళ్ల హాల్టింగ్, స్టేషన్ అభివృద్ధి అంశాలను రైల్వే మంత్రిత్వశాఖ దృష్టికి తీసుకెళతాం. తెలంగాణాలో ఉన్న భద్రాచలం రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేసి, రైలు సౌకర్యం కల్పించినప్పుడు ఆంధ్రా భద్రాచలం రైల్వేశాఖకు కనిపించలేదా. భక్తులు ఒంటిమిట్టకు చేరుకునేందుకు ఒక్కరైలు కూడా అందుబాటులో లేదు.

– తల్లెం భరత్‌రెడ్డి, డీఆర్‌యుసీసీ సభ్యుడు

క్లుప్తంగా

రిమ్స్ మార్చురీలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



కడప అర్బన్ : కడప రిమ్స్‌లో ఈనెల 17వ తేదీని గుర్తు తెలియని వ్యక్తి (40)ని ఉదయం తీవ్ర అనారోగ్యంతో ఉండగా చేర్పించారు. వచ్చిన కొద్ది సేపటికే మృతి చెందాడు. మృతునికి సంబంధించిన పూర్తి వివరాలతో తమను సంప్రదించాలని రిమ్స్ అధికారులు కోరారు. మృతదేహాన్ని మార్చురీలో ఉంచారు.

చీటింగ్ కేసు నమోదు

కొండాపురం : భూమి కొనుగోలుకు తన వద్ద రూ. 60 లక్షలు నగదు తీసుకుని అగ్రిమెంట్ రాసుకున్న తర్వాత అదే భూమిని వేరొకరికి విక్రయించారంటూ నరసింహారెడ్డి అనే వ్యక్తి చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. కొండాపురం ఎస్ఐ విద్యాసాగర్ కథనం మేరకు వివరాలు ఇలా.. మండల పరిధిలోని గండ్లూరు గ్రామానికి చెందిన నరసింహారెడ్డి అనంతపురం జిల్లా యల్లనూరు మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన కులశేఖర్‌రెడ్డి, అమర్‌నాథరెడ్డి కుటుంబ సభ్యులకు చెందిన 17 ఎకరాల భూమిని కొనుగోలు చేశాడు. రూ. 60 లక్షలు నగదు ఇచ్చినట్లు అగ్రిమెంట్ రాసుకున్నాడు. అయితే ఈ 17 ఎకరాల్లో 10 ఎకరాల భూమిని కులశేఖరరెడ్డి కుటుంబ సభ్యులు వేరే వారికి విక్రయించారు. దీంతో బాధితుడు నరసింహారెడ్డి తన వద్ద డబ్బు తీసుకుని అగ్రిమెంట్ రాయించుకున్న తర్వాత తనకు భూమి ఇవ్వకుండా మోసం చేశారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

డివైడర్‌ను ఢీకొన్న ద్విచక్ర వాహనం

– వ్యక్తికి తీవ్ర గాయాలు

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని ముద్దనూరు రోడ్డు గాంధీ సర్కిల్ వద్ద ద్విచక్ర వాహనం డివైడర్‌ను ఢీకొంది. ఈ సంఘటనలో వెంగ గురుడు అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వెంగగురుడు పట్టణంలోని బజాజ్ ఫైనాన్స్‌లో పని చేస్తున్నాడు. ముద్దనూరు రోడ్డులోని కొత్త బస్టాండు సమీపంలో నుంచి పని నిమిత్తమై పులివెందుల పట్టణానికి వస్తుండగా గాంధీ సర్కిల్ వద్ద ఉన్న డివైడర్‌ను ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. ట్రాఫిక్ సీఐ హాజీవలి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికులు 108 వాహనానికి ఫోన్ చేశారు. వాహనం అందుబాటులో లేకపోవడంతో విధిలేని పరిస్థితిలో క్షతగాత్రుడిని ఆటోలో ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అనుమతులకు కృషి

కాశినాయన : జ్యోతిక్షేత్రంలోని కాశినాయన ఆశ్రమానికి కేంద్ర అటవీశాఖ మంత్రితో మాట్లాడి అనుమతులు తెచ్చేందుకు కృషి చేస్తున్నామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన కాశినాయన ఆశ్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆశ్రమానికి అటవీశాఖ అధికారులు అనుమతులు లేవని కూల్చివేయడం బాధాకరమన్నారు. ఐదు హెక్టార్ల భూమిని ఆశ్రమానికి ఇచ్చేందుకు కేంద్ర అటవీశాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ ఒప్పుకున్నారని తెలిపారు. త్వరలో అనుమతులు తీసుకువస్తామన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, బీజేపీ కడప పార్లమెంటు అధ్యక్షుడు సుబ్బరాయుడు, మాజీ అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి, పోరుమామిళ్ల సర్పంచ్ యనమల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కళ్లద్దాలకు..అవినీతి మసక!

- టెండర్ల ఆహ్వానంలోనే మతలబు
- 5,200 మంది విద్యార్థులకు నాసిరకం కళ్ల జోళ్లు అందజేత
- రూ.లక్షలు నొక్కేసిన వైనం
- జిల్లా అంధత్వ నివారణ సంస్థలో అక్రమాలు



'సర్వేంద్రియాణాం నయనం ప్రధానం' అనే సంగతిని మరిచారు. పాపం.. దృష్టి లోపంతో బాధపడుతున్న చిన్నారుల కళ్లద్దాలపై అవినీతి కన్ను పడింది. నాసిరకం కళ్లద్దాలను పంపిణీ చేశారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థలో వెలుగు చూసిన అక్రమాలు విస్మయం కలిగిస్తున్నాయి.

కడప పాత రిమ్స్‌లోని జిల్లా అంధత్వ నివారణ సంస్థ కార్యాలయం

సాక్షి టాస్క్‌ఫోర్స్ : జిల్లాలోని పాఠశాల విద్యార్థులకు ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేయాలని జిల్లా అంధత్వ నివారణ సంస్థ నిర్ణయించింది. ఆ మేరకు కళ్ల జోళ్ల పంపిణీ కోసం 2025 జనవరి 4వ తేదీన టెండర్లు పిలిచారు. ఇందులో జిల్లాలోని పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షల కార్యక్రమంలో భాగంగా దృష్టి లోపంతో బాధపడుతున్న 5,200 మందికి ఉచితంగా కళ్ల జోళ్లను పంపిణీ చేయాలి. సకాలంలో మంచి నాణ్యత గల కళ్ల జోళ్లు అందించగల సంస్థల నుంచి టెండర్లను ఆహ్వానించారు. టీఆర్–90/పాలీకార్బొనేట్ ఫుల్ ఫ్రేమ్ (బాలురు, బాలికలకు వివిధ రకాల రంగుల్లో) లెన్స్:సీఆర్–39 (ప్లాస్టిక్ లెన్స్) నాణ్యత కలిగి ఉండాలి. ఆసక్తి కలిగిన సరఫరాదారులు తమ కనిష్ట ధరను సీల్డ్ కవర్‌లో ఉంచి నమూనా ఫ్రేముతో పాటుగా 6 నుంచి 17వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు జిల్లా అంధత్వ నివారణ సంస్థ (జిల్లా ప్రోగ్రాం మేనేజర్)కు అందజేయాలని సూచించారు. కాగా టెండరు ప్రకటనలో వైఎస్సార్ కడప జిల్లా పరిధిలోని సంస్థల (ఆప్టికల్ షాపుల యాజమాన్యాలు) వారు మాత్రమే టెండర్లలో పాల్గొనాలని షరతు విధించారు. గతంలో ఇలా ఎప్పుడూ జరిగిన దాఖలాలు లేవు. ఇప్పుడు మాత్రమే జిల్లాలో ఉన్న వారికి మాత్రమే టెండర్లలో పాల్గొనేందుకు అవకాశం కల్పించడంపై అనుమానాలు తలెత్తాయి. ఇలా ఆదిలోనే అక్రమాలకు బీజం పడినట్లయింది.

అనుకూలమైన వారికి వచ్చేలా చక్రం తిప్పారు..

ఈ టెండర్లలో జిల్లాకు చెందిన వారు మొత్తం నలుగురు పాల్గొన్నారు. అందులో కడప నగరానికి చెందిన ఆప్టికల్ షాపు యజమాని రూ.270 విలువైన నాణ్యమైన కళ్లద్దాలు, బాక్స్‌ను పంపిణీ చేస్తానని టెండర్‌లో పొందుపరిచారు. మిగతా ముగ్గురు అంతకంటే తక్కువ ధరను కోట్ చేశారు. వాస్తవానికి టెండర్ తక్కువ ధరకు వేసిన వారికే రావాలి. అయితే ఇక్కడ కడప నగరానికి చెందిన పంపిణీదారుడికి టెండర్ దక్కాలని మిగతా ముగ్గురు టెండర్ దారులతో మధ్యవర్తిత్వం నడిపారు. ఒప్పందం కుదిర్చారు. దీంతో సిండికేట్‌గా మారారు. అందుకుగాను ఒకరికి రూ 1.70 లక్షలు, మిగతా ఇద్దరికి రూ.70 వేలు చొప్పున డబ్బును ముట్టజెప్పినట్లు తెలిసింది. ఫలితంగా టెండర్ల నుంచి ముగ్గురు తప్పుకోవడంతో కడప నగరానికి చెందిన పంపిణీదారుడి టెండర్ సీల్డ్ కవర్‌ను బాక్స్‌లో వేశారు. ఆ బాక్సులో ఉన్న కవర్‌ను జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో తెరిచారు. టెండర్ తమకు అనుకూలమైన కడప నగరానికి చెందిన పంపిణీదారుడికి దక్కేలా చేసే విషయంలో అధికారులకు..టెండర్‌దారులకు మధ్య డీల్ కుదిరేలా ఒక ఆప్తాలమిక్ ఆఫీసర్ వ్యవహారం నడిపారనే ఆరోపణలున్నాయి.

నాణ్యతా ప్రమాణాలను గాలికొదిలేశారు..

కళ్ల జోళ్ల నాణ్యతా ప్రమాణాలను ఆ విభాగంలో పనిచేసే ఆప్తోమెట్రిస్ట్ (అద్దాలను పరీక్షించేవారు), ఆప్తాలమిక్ ఆఫీసర్స్ (కంటి వైద్యాధికారులు) పరీక్షిస్తారు. అలాగే ఈ నాణ్యతా పరీక్షలను రిమ్స్ కంటి వైద్యులు నిర్వహించాలి. ఈ నిర్ధారణ పరీక్షల్లో నాణ్యమైన అద్దాలని తేలితేనే విద్యార్థులకు అందజేయాలి. అయితే ఈ ప్రమాణాలను పాటించిన దాఖలాలు లేవు. కాగా ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఆప్తాలమిక్ ఆఫీసర్స్ 15 మంది పనిచేస్తున్నారు.

లక్షలు నొక్కేశారు..

ప్రస్తుతం రూ.270తో పంపిణీ చేసిన కళ్ల జోళ్లు ఒక ప్రముఖ కంటి వైద్యశాలలో రూ. 60–80కే లభిస్తున్నట్లుగా అనుకుంటున్నారు. ఆ ప్రకారం ఒక జత కళ్ల జోళ్ల ధర రూ.270తో అయితే మొత్తం రూ.14.04 లక్షలు అవుతుంది. అదే రూ.80తో వేసుకుంటే మొత్తం రూ. 4.16 లక్షలు అవుతుంది. అంటే దాదాపుగా రూ.10 లక్షల వరకు చేతులు మారాయి. ఈ అంశాలపై ఇంటా..బయటా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ అవినీతి వ్యవహారంపై సమగ్రంగా విచారణ చేపట్టి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నాణ్యమైన అద్దాలు చూపి.. నాసిరకం పంపిణీ..

రూ.270 అంటే నాణ్యమైన కళ్లద్దాలే వస్తాయి. నమూనాగా చూపించినప్పుడు రూ.270 విలువైన నాణ్యమైన అద్దాలు చూపారు. టెండరు దక్కాక రూ.60–80 విలువ చేసే నాసిరకం కళ్ల జోళ్లను పంపిణీ చేశారు. దీంతో విద్యార్థులకు అందజేసిన అద్దాల ఫ్రేములు సరిగా లేకపోవడం..విరిగిపోవడం..చూపు సక్రమంగా కనిపించకపోవడం..సైజ్ సరిపోకపోవడం తదితర సమస్యలు తలెత్తాయి. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు.



ప్రస్తుతం పంపిణీ చేసిన అద్దాలు

2024లో నాసిరకం అద్దాలకు అడ్డుకట్ట..

విద్యార్థులకు కళ్లద్దాల పంపిణీ కార్యక్రమం 2024లో కూడా జరిగింది. అప్పుడు టెండర్లను ఆహ్వానించినప్పుడు పంపిణీదారులకు ఎలాంటి ఆంక్షలు విధించలేదు. అప్పట్లో ప్రకాశం జిల్లాకు చెందిన పంపిణీదారుడు టెండరులో పాల్గొన్నారు. రూ.180కే నాణ్యమైన కళ్లద్దాలను పంపిణీ చేస్తానని టెండర్ వేశారు. కడప నగరానికి చెందిన ఇదే వ్యక్తి నాడు రూ.168కే పంపిణీ చేస్తానని టెండర్ దక్కించుకున్నారు. ఈ పంపిణీదారుడు అప్పుడు కూడా నమూనాగా నాణ్యమైన కళ్ల జోళ్లను చూపి నాసిరకం అద్దాలను పంపిణీ చేసేందుకు యత్నించారు. దీంతో ప్రకాశం జిల్లాకు చెందిన వ్యక్తి అడ్డుతగిలారు. కడప నగరానికి చెందిన పంపిణీదారుడు నాసిరకం అద్దాలు పంపిణీ చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. దీంతో కడప పంపిణీదారుడు గత్యంతరం లేక నాణ్యమైన కళ్లద్దాలు పంపిణీ చేయడంతో గొడవ సద్దుమణిగింది.



నాడు పంపిణీ చేసిన అద్దాలు

ఫ్లైయాష్ వ్యవహారంపై విచారణ

ఎర్రగుంట్ల : డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు (ఆర్టీపీపీ)లో ఫ్లెయాష్ రవాణా వ్యవహారంపై ఏపీజెన్‌కో యాజమాన్యం రహస్యంగా విచారణ చేపట్టింది. గురువారం ఏపీజెన్‌కో నుంచి కొందరు అధికారులు విచారణ నిమిత్తం ఆర్టీపీపీకి వచ్చారు. గతంలో ఫ్లెయాష్ విషయంలో అవకతవకలు జరిగినట్లు విచారణలో తేలడంతో ముగ్గురు అధికారులపై వేటు వేసిన విషయం తెలిసిందే. అయితే తాజాగా ఇప్పుడు ఫ్లెయాష్ వ్యవహారంపై రహస్యంగా విచారణ చేపట్టడం ప్రాముఖ్యత సంతరించుకుంది. ఈ విషయంపై ఆర్టీపీపీ సీఈ గౌరీపతిని ఫోన్‌లో వివరణ కోరగా సాధారణ విచారణలో భాగంగానే ఏపీజెన్‌కో నుంచి అధికారులు వచ్చి విచారణ చేపడుతున్నారని తెలిపారు.

మామిడి తోటకు నిప్పు

– 40 చెట్లు దగ్ధం



ఆకతాయిల చేష్టలకు కాలుతున్న మామిడి తోట

చిన్నమండెం : ఆకతాయిలు మామిడి తోటకు నిప్పు పెట్టడంతో 40 మామిడిచెట్లు కాలిపోయినట్లు బాధిత రైతులు బయన్న, రామచంద్ర, రమణయ్య తెలిపారు. వారి కథనం మేరకు.. మండల పరిధిలోని నాగూరు వాండ్లపల్లె సబ్ స్టేషన్ పక్కన గల మామిడితోట వద్ద గల కంచెకు ఆకతాయిలు నిప్పు పెట్టారు. దీంతో మామిడి తోట దగ్ధం కావడంతో అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే వారు చేరుకొని మంటలను అదు చేశారు. అప్పటికే 40 చెట్లు కాలిపోయాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

రైతు వ్యతిరేక ప్రభుత్వమిది

- వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర లేదు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్రంలో రైతు వ్యతిరేక ప్రభుత్వం పాలన సాగిస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాబు–కరువు కవల పిల్లల్లాంటి వారని ఎద్దేవా చేశారు. కరువుతో రైతులు, వ్యవసాయ కూలీలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చాలా ప్రాంతాల్లో పంటలు పూర్తిగా కోల్పోవాల్సి వచ్చిందని, కొన్ని ప్రాంతాల్లో సగం పంటలు చేతికి వచ్చాయన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం నుంచి రైతులకు సరైన ప్రోత్సాహం లేనందువల్ల ఆత్మహత్యలు చేసుకోవాల్సిన దుర్గతి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో క్రమం తప్పకుండా రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందించేవారన్నారు. అన్నదాత సుఖీభవ పేరిట తాను రూ. 20 వేలు ఇస్తానంటూ ఎన్నికల ముందు ప్రకటించిన చంద్రబాబు ఈ సంవత్సరం దాని ఊసే మరిచిపోయారని విమర్శించారు. జిల్లాలో శనగ, మినుములు, కంది, వరి, చెరుకు లాంటి ఏ పంటకు మద్దతు ధర కల్పించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ యేడాది శనగ ఎకరాకు 3–4 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చిందన్నారు. ప్రభుత్వం మద్దతు ధరతో మార్క్‌ఫెడ్ ద్వారా శనగ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని చెబుతున్నారని పేర్కొన్నారు. అయితే ఈ–క్రాప్ చేసుకోవాలని ఇంకా పలు నిబంధనలు విధించడం వల్ల రైతులు అదే ధరకు బయట వ్యాపారులకు విక్రయిస్తున్నారన్నారు. తమ ప్రభుత్వ హయాంలో అరటి, ఎర్రగడ్డలకు సైతం మద్దతు కల్పించామన్నారు. చంద్రబాబు పాలనలో ఉద్యాన పంటలను పట్టించుకునే నాథుడే లేకుండా పోయారన్నారు. జిల్లాలో 42 డిగ్రీల ఎండ తీవ్రత ఉండడంతో మామిడి పూత, పిందె రాలిపోతోందని, ఈ పరిస్థితుల్లో మామిడి రైతులను ఆదుకునే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పంటల మద్దతు ధర కోసం బడ్జెట్‌లో అరకొర కేటాయింపులు చేశారని, అవి కూడా ఏమేరకు విడుదల చేస్తారో తెలియడం లేదన్నారు. రైతు వ్యతిరేకి చంద్రబాబు ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు త్వరలోనే ఉన్నాయన్నారు. రైతు నాయకుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఫిబ్రవరిలో క్వింటాలు బుడ్డశనగ ధర రూ. 5100 నుంచి రూ. 5250 వరకు ఉండేదన్నారు. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కల్లాల్లోనే వ్యాపారులకు విక్రయించుకున్నారని, ప్రస్తుతం ఐదు శాతం శనగలు కూడా రైతుల వద్ద లేవన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు బాలయ్య, ఆ పార్టీ నాయకులు పులి సునీల్‌కుమార్, ఇలియాస్, మునిశేఖర్‌రెడ్డి, నాగేంద్ర, నాగేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతన్న ఉసురు తీసిన అప్పులు

పురుగుల మందు తాగి యువ రైతు ఆత్మహత్య





పొలంలో మృతి చెందిన రైతు పత్తి రామచంద్రారెడ్డి

ఖాజీపేట : సాగుచేసిన పంటలకు సరైన మద్దతు ధర లేకపోవడం, సరైన దిగుబడి రాక పోవడంతో ఏటా సాగు వ్యయం పెరిగింది. చేసిన అప్పులు తీరడం లేదు. వడ్డీల మీద వడ్డీలు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో మనో వ్యథతో ఓ యువ రైతు తన పంట పొలంలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

ఖాజీపేట మండలం బి.కొత్తపల్లె పంచాయతీలోని బక్కాయపల్లె గ్రామానికి చెందిన పత్తి రామచంద్రారెడ్డి (42) చురుకైన వ్యవసాయ యువ రైతు. తనకు 2.50 ఎకరాల పొలం ఉంది. ఈ పొలంతో పాటు అదనంగా 10 ఎకరాలను గుత్తకు తీసుకుని వ్యవసాయం చేసేవాడు. ఖరీఫ్, రబీ రెండు సీజన్లలో పంటలు సాగు చేసేవాడు. ముఖ్యంగా వరి, వేరుశనగతోపాటు పలురకాల పంటలు సాగు చేసేవాడు. అయితే గత రెండు సంవత్సరాలుగా పంట దిగుబడి వస్తే మార్కెట్‌లో సరైన గిట్టుబాటుధర లేక పోవడం, ఇలాగే మార్కెట్‌లో ధర ఉన్నప్పుడు సరైన దిగుబడి రాక పోవడం జరిగేది. దీంతో పండించిన పంటలపై సరైన ఆదాయం లేదు. పొలం గుత్త చెల్లించలేక ఏటా నష్టాలను చవిచూడాల్సి వచ్చేది. పంట సాగు కోసం ఏటా అప్పులు తీసుకురావడం.. ఆ అప్పులు తీరకముందే పంట సాగు చేసే ప్రయత్నంలో తిరిగి అప్పులు చేయడం మామూలైంది. ఫలితంగా అప్పులు అధికమై తీవ్ర మానసిక ఒత్తిడికి లోనయ్యాడు.

పొలంలోనే ఆత్మహత్య..

ఏటా తాను సాగుచేసే పంటలకు అప్పులు తీసుకురావడం వల్ల సుమారు రూ.15లక్షల మేరకు అప్పులు అయ్యాయి. వచ్చే సీజన్‌లో పంటలు సాగుచేస్తే ఆదాయం వస్తుందన్న నమ్మకాన్ని రైతు కోల్పోయాడు. ఈ నేపథ్యంలో ఈనెల 18వ తేదీ మంగళవారం రాత్రి పొలంలో పంటకు నీరు పట్టి వస్తానని ఇంటిలో చెప్పి పొలం వద్దకు వెళ్లాడు. పొలంలోనే పురుగుల మందు తాగి అక్కడే పడిపోయాడు. పొలంలో పడిపోయి ఉన్న రైతును చూసి మరో రైతు పిలిచాడు. ఎంతకూ పలకక పోవడంతో దగ్గరకు వెళ్లి చూడగా చనిపోయినట్లు గమనించి గ్రామస్తులకు సమాచారం చేరవేశాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు పొలం వద్దకు చేరుకుని పత్తి రామచంద్రారెడ్డి మృతదేహాన్ని చూసి బోరున విలపించారు.

కేసు నమోదు

మృతి చెందిన రైతు భార్య పత్తి శిరీషా ఫిర్యాదు మేరకు ఖాజీపేట సీఐ మోహన్ కేసు నమోదు చేశారు. కడప రిమ్స్‌లో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. బుధవారం సాయంత్రం బంధువులు అంత్యక్రియలు నిర్వహించారు.

చెడు వ్యసనాలకు బానిసలై.. ఏటీఎంలో చోరీకి యత్నం

ఇద్దరు నిందితుల అరెస్టు



నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ నరేష్‌బాబు

ఎర్రగుంట్ల : చెడు వ్యసనాలకు బానిసలై డబ్బుల కోసం ఏకంగా ఏటీఎంలో చోరీకి యత్నించిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి కారు, గ్యాస్ సిలిండర్, ఆక్సిజన్ సిలిండర్‌ను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం సాయంత్రం ఎర్రగుంట్ల పోలీస్ స్టేషన్‌లో పట్టణ సీఐ నరేష్‌బాబు విలేకరులకు వివరాలు వెల్లడించారు. రాజుపాళెం మండలం తొండలదిన్నె గ్రామానికి చెందిన కొత్తమాసి సుధీకర్, గాలిపోతుల అభిషేకం స్నేహితులు. వీరిలో కొత్తమాసి సుధీకర్ 2020 సంవత్సరం నుంచి సెక్యూర్ వ్యాలీవ్ కంపెనీ ద్వారా ఏటీఎంలకు డబ్బులను లోడ్ చేసేవాడు. ఇతను చెడు వ్యసనాలకు బానిసై అప్పుల పాలయ్యాడు. ఈ నేపథ్యంలో గత ఏడాది అక్టోబర్ నెలలో ఏటీఎంలకు డబ్బులు లోడ్ చేసే క్రమంలో అప్పుడప్పుడు డబ్బులను దొంగిలిస్తూ సుమారు రూ.36 లక్షలు తన చెడు వ్యసనాలకు వాడుకున్నాడు. సెక్యూర్ వ్యాలీవ్ కంపెనీవారు డబ్బులు కాజేసిన విషయాన్ని తెలుసుకుని కొత్తమాసి సుధీకర్‌ను ఉద్యోగం నుంచి తొలగించారు. వాడుకున్న డబ్బును ష్యూరిటీ ఇచ్చిన వ్యక్తి వద్ద నుంచి వసూలు చేసుకుంటున్నారు. ఆ తర్వాత సుధీకర్ జల్సాలకు డబ్బులు అవసరం కావడంతో దొంగతనాలకు అలవాటు పడ్డాడు. దీంతో ఎర్రగుంట్ల పట్టణం వేంపల్లి రోడ్డులో ఐసీఐసీఐ బ్యాంకు ఏటీఎం మూసి ఉన్న విషయం తెలుసుకున్నాడు. గతంలో ఈ ఏటీఎంలో డబ్బులు లోడ్ చేసి ఉండటంతో సులువుగా డబ్బులు దొంగిలించవచ్చనుకున్నాడు. ఈ తరుణంలోనే ప్రొద్దుటూరులోని ఆటో నగర్‌లో వెల్డర్‌గా పనిచేస్తున్న గాలిపోతుల అభిషేకంను తోడు చేసుకుని గ్యాస్ , ఆక్సిజన్ సిలిండర్ల సాయంతో ఈ నెల 17వ తేదీన మధ్యాహ్నం ఏటీఎంలోకి వచ్చి షటర్ మూసి ఏటీఎం బాక్సును కట్ చేసి డబ్బులు సులువుగా దొంగిలించవచ్చనుకున్నారు. అయితే ఏటీఎం క్యాష్ బాక్స్ మెయిన్ డోర్ ఎంత సేపటికి తెరుచుకోలేదు. దీంతో ఎవరైనా వస్తారేమో అనే భయంతో అక్కడి నుంచి కారులో వస్తువులన్నీ వేసుకుని వెళ్లిపోయారు. ఈ విషయంపై ఐసీఐసీఐ బ్యాంక్ మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నిందితులిద్దరిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

మైదుకూరులో ఆలయ భూముల సర్వే



సర్వే చేసిన చోట రాళ్లను పాతిస్తున్న దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్

మైదుకూరు : మైదుకూరులో శ్రీ పార్వతీ సమేత భీమేశ్వరస్వామి ఆలయానికి చెందిన భూములను బుధవారం దేవదాయ శాఖ అధికారులు సర్వే చేయించారు. పట్టణంలోని ప్రొద్దుటూరు రోడ్డులో ఇటీవల కొందరు నిర్మించిన కాంప్లెక్స్ దేవాలయ భూముల్లో నిర్మించారని ఆరోపణలు, ఫిర్యాదులు రావడంతో బుధవారం దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయ భూమును పోలీసు బందోబస్తుతో సర్వే చేసి కొలతలు వేశారు. భీమేశ్వరస్వామి ఆలయానికి చెందిన సర్వే నంబర్లు 1052/ఏ లో 1.98 ఎకరాలు, 1052/బీలో 1.83 ఎకరాలు, 1052/సీలో 0.65 ఎకరాలు, 1845లో 10.20 ఎకరాలు, 1031లో 6.22 ఎకరాలు, 1054లో 1.56 ఎకరాలు, 1054/బీలో 1.34 ఎకరాలు, 1087/ఏలో 2.10 ఎకరాలు ఉన్నాయని ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్ విలేకరులకు తెలిపారు. కాగా బుధవారం కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారి బైపాస్ సమీపంలో కేసీ కెనాల్‌కు ఉత్తరం వైపున ఉన్న సర్వే నంబర్ 1052/ఏలోని 1.98 ఎకరాలను, 1052/సీలోని 0.65 ఎకరాలను సర్వే చేయించి గుర్తింపు రాళ్లను పాతించారు. 1052/బీలోని 1.83 ఎకరాలకు సంబంధించిన భూముల్లో నిర్మాణాలు చేసిన వారు అభ్యంతరం వ్యక్తం చేయడం, వాటిపై కోర్టుకు వెళ్లినట్టు తెలియడంతో ఆ సర్వే నంబర్‌లోని భూములను దేవదాయ శాఖ అధికారులు సర్వే చేయించలేదు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్ మాట్లాడుతూ ఆలయ భూముల్లో కొందరు నిర్మాణాలు చేపట్టడంపై ఇటీవల ఫిర్యాదులు రావడంతో భూములను గుర్తించేందుకు సర్వే చేపట్టినట్టు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ప్రొద్దుటూరు ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, మైదుకూరు ఈఓ ప్రసాద్ రావు, కడప ఇన్‌స్పెక్టర్ శివయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులను ఆదుకోని ప్రభుత్వం

మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



రైతు మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ఖాజీపేట : కూటమి ప్రభుత్వం మోసపూరిత ప్రభుత్వం.. రైతులను మోసగించిన దగా ప్రభుత్వం అని మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ప్రభుత్వ తీరుపై తీవ్రంగా మండిపడ్డారు. ఖాజీపేట మండలం బి.కొత్తపల్లె పంచాయతీ బక్కాయపల్లె గ్రామంలో యువ రైతు పత్తి రామచంద్రారెడ్డి పొలంలో ఆత్మహత్య చేసుకున్న విషయం తెలుసుకుని గ్రామానికి చేరుకున్నారు. మృతి చెందిన రైతుకు నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చనిపోయిన రైతు మంచి రైతుగా గ్రామంలో పేరు ఉందన్నారు. తాను పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక పోవడంతో ఏటా సాగుకు అప్పులు తీసుకు వచ్చి సాగు చేసేవాడన్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం లేక పోవడంతోనే రైతులు ఆత్మహత్యలకు పాల్పడాల్సి వస్తోందన్నారు. చంద్రబాబు వ్యవసాయం దండగ అన్నారని ఆయన అన్నట్లుగానే కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. రైతులకు అందాల్సిన రైతు భరోసా ఎక్కడని ప్రశ్నించారు. తమ ప్రభుత్వంలో రైతులు ఒక్క రూపాయి కూడా ఇన్సూరెన్స్ చెల్లించేవారు కాదన్నారు. ప్రభుత్వమే రైతుల తరపున ఇచ్చేదని తెలిపారు. ఒక్క ఖాజీపేట మండలానికే పంట నష్ట పరిహారం రూ.27 కోట్లు మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చారని గుర్తు చేశారు. ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు రైతుల పంటకు గిట్టుబాటు ధర లేకపోతే గిట్టు బాటు ధర కల్పించి కొనుగోలు చేశామన్నారు. నేడు కూటమి ప్రభుత్వం రైతుల నుంచి ఒక్క గింజైనా కొనుగోలు చేసిందా అని ప్రశ్నించారు. రైతు ఆత్మహత్యలతోనైనా ప్రభుత్వం కళ్లు తెరవాలని హితవు పలికారు. చనిపోయిన రైతు కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయంతో పాటు వారి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మాజీ వ్యవసాయ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి రాఘవరెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ కడప జోనల్ మాజీ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, మైదుకూరు రైతు విభాగం నాయకుడు నాగిరెడ్డి, కేసీ కెనాల్ ప్రాజెక్టు కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

అన్నం పెట్టే రైతుకు దిక్కులేకుండా పోయింది

కడప కార్పొరేషన్ : అన్నం పెట్టే రైతుకు కూటమి ప్రభుత్వంలో దిక్కులేకుండా పోయిందని మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయం వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ బక్కాయపల్లె గ్రామంలో ఆత్మహత్య చేసుకున్న యువ రైతుకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారన్నారు. పెద్ద కుమార్తె పదో తరగతి పరీక్షలు రాస్తుండగా, చిన్న కుమార్తె 7వ తరగతి చదువుతోందన్నారు. రైతు కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు.

ఈ ప్రభుత్వం రైతులను గాలికొదిలేసింది

కూటమి ప్రభుత్వం రైతాంగాన్ని గాలికొదిలేసిందని, ఫలితంగా అప్పులు ఎక్కువై వారు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. రెండు నెలల క్రితం మైలవరంలో మిర్చి రైతు, ఇప్పుడు వరి రైతు ఉసురు తీసుకున్నాడన్నారు.